క్లుప్తంగా

పాలిటెక్నిక్ ఎంట్రన్స్ ఉచిత తరగతులు



గుంటూరు రూరల్: వట్టిచెరుకూరు మండలంలోని మలినేని లక్ష్మయ్య ఉమెన్స్ పాలిటెక్నిక్ కాలేజీలో ఉచితంగా పాలిటెక్నిక్ ప్రవేశాలకు శిక్షణ తరగతులు నిర్వహించటం జరుగుతుందని కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు తెలిపారు. పుల్లడిగుంటలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతులను చుట్టుపక్కల గ్రామాలు, మండలాల, పట్టణాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎవరైనా విద్యార్థులకు పాలిటెక్నిక్‌పై ఆసక్తి ఉన్నట్లయితే మా కళాశాలలో ఉచిత శిక్షణతో పాటు ఉచిత బస్సు సౌకర్యం కూడా కల్పించినట్లు చెప్పారు. ప్రిన్సిపాల్ రమేష్ బాబు మాట్లాడుతూ ప్రవేశ పరీక్షల కోసం వస్తున్నటువంటి విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించి వారికి తగిన విధంగా శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.

చలపతి ఇంజినీరింగ్‌లో ప్రాజెక్ట్ ఎక్స్‌పో



గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంలోని చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో టెక్నో ఫ్యూచర్ ఇండియా, కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో స్టూడెంట్ ప్రాజెక్ట్ ఎక్స్‌పో యూజింగ్ జనరేటివ్ ఏఐ అనే అంశంపై ప్రాజెక్ట్ ఎక్స్‌పోను నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌టీసీ సేల్స్ ఫోర్స్ డెవలప్‌మెంట్ ఇంజినీర్ రేగుల నరేంద్రబాబు మాట్లాడారు. ఏఐ ద్వారా ప్రాజెక్ట్‌ల రూపకల్పనపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్, సెక్రటరీ కరస్పాండెంట్ వై. సుజిత్‌కుమార్ అభినందించారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ సువర్ణకు డాక్టరేట్



చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సువర్ణ బురదగుంటకు తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందించిందని వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ మంగళవారం తెలిపారు. ''అటెన్షన్-బేస్డ్ డీప్ లెర్నింగ్ అప్రోచెస్ ఫర్ ఎన్‌హ్యాన్స్‌డ్ ప్రొడక్ట్ రెకమెండేషన్ సిస్టమ్స్'' అనే అంశంపై సువర్ణ పరిశోధన చేశారని చెప్పారు. పీహెచ్‌డీ పట్టా పొందిన సువర్ణను పలువురు అభినందించారు.

పురమిత్ర యాప్‌ను వినియోగించుకోండి

మంగళగిరి టౌన్: ప్రజలు పంపిన సమస్యలను సకాలంలో అధికారులు పరిష్కరించేందుకు ప్రభుత్వం పురమిత్ర యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్ బాషా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పురమిత్ర మొబైల్ అప్లికేషన్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుని లాగిన్ అయ్యి, ప్రజలు వారి సమస్యలను పొందుపర్చ వచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని నగరపాలక సంస్థ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

విదేశీ విద్యకు యూబీఐ చేయూత



కొరిటెపాడు(గుంటూరు): విదేశీ విద్యకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) చేయూతనిస్తోందని ఆ బ్యాంక్ రీజినల్ హెడ్ ఎస్.జవహర్ పేర్కొన్నారు. జీటీ రోడ్‌లోని యూబీఐ ప్రాంతీయ కార్యాలయం ఆవరణలో విదేశీ విద్యనభ్యసించదలచిన విద్యార్థులకు రుణ మంజూరు పత్రాలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా యూబీ రీజినల్ హెడ్ జవహర్ మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విద్యార్థులకు సకాలంలో కొల్లేటరల్ అవసరం లేని విద్యా రుణాలను అందిస్తోందని, ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పలువురు విద్యార్థులు మాట్లాడుతూ అతి తక్కువ సమయంలో కొల్లేటరల్ అవసరం లేని రుణాలను అందించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ డెప్యూటీ రీజినల్ హెడ్స్ అశ్వర్థనాయక్, ఎ.రాజేష్, రిటైల్ లోను పాయింట్ హెడ్ రామాంజనేయకుమార్ పాల్గొన్నారు.

కలుషిత నీటితో వెతలు

- ఇబ్బందులు పడుతున్న 25వ వార్డు వాసులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



మునిసిపల్ కుళాయి నుంచి వచ్చిన కలుషిత నీరు

పొన్నూరు: పట్టణంలో రక్షిత తాగునీటి పథకం నుంచి కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న స్వచ్ఛమైన తాగునీరు పలు వార్డులకు అందని ద్రాక్షగా మారింది. నిత్యం పట్టణంలోని ఏదో ఒక వార్డులో నీరు కలుషితమవుతుందంటూ ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ అధికారులు ఏ వార్డుకు వెళ్లినా నీటి శుభ్రత.. వాసన చూడాల్సిన స్థితి. స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ఏటా కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని చెబుతున్న అధికారుల మాటలు ప్రకటనలకే పరిమితం అవుతున్నాయి.

- పట్టణంలోని 25వ వార్డు నూర్ మసీదు రెండోలైనులో 15 రోజులుగా కలుషిత నీరు సరఫరా అవుతోందని స్థానికులు చెబుతున్నారు. తీవ్ర దుర్వాసన, రంగుమారిన నీరు కుళాయి ద్వారా సరఫరా అవుతుందని వాపోతున్నారు. సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ నీటిని కనీసం గృహావసరాలకు కూడా వినియోగించలేకపోతున్నామని, కుళాయి నీటితో స్నానం చేస్తే చర్మ వ్యాధులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం నాణ్యతా ప్రమాణాలు పాటించి నీటిని ప్రజలకు సరఫరా చేయాల్సి ఉన్నా... క్షేత్రస్థాయిలో ఎక్కడా ఆ విధంగా జరగడం లేదనే విమర్శలు ప్రజల నుంచి వస్తున్నాయి.

రంగుమారిన నీటితో అవస్థలు



గత 15 రోజుల నుంచి కుళాయిల ద్వారా రంగు మారిన నీరు సరఫరా అవుతోంది. దుర్వాసన కూడా వస్తుంది. నీటిని వినియోగించలేకపోతున్నాం. అధికారులకు చెప్పినా ఫలితం ఉండటంలేదు. కుళాయి నీటిని వినియోగిస్తే చర్మ సంబంధిత సమస్యలు వస్తున్నాయి. ఇక తాగేందుకు అవసరమైన నీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు తగిన చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలి.

– షేక్ షకీల, స్థానికురాలు

కలుషిత నీటి సరఫరాను అరికడతాం



రక్షిత తాగునీటి పథకం నుంచి శుద్ధి చేసిన నీటినే ప్రజలకు అందించేలా చర్యలు తీసుకుంటాం. శుభ్రమైన నీటి సరఫరా విషయంలో ఎప్పటికప్పుడు జాగ్రత్తలు పాటిస్తున్నాం. వారు ఇప్పటికే పనులు ప్రారంభించారు. సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు సరఫరా చేస్తున్నాం.

– వెంకయ్య, డీఈ, పొన్నూరు

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే
కఠిన చర్యలు

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు రూరల్: జిల్లాలో అసాంఘిక శక్తులపై నిఘా ఉంచినట్లు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ పేర్కొనఆనరు. పెదనందిపాడు పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీమంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ నిర్వహణ, పోలీస్ సిబ్బంది, మహిళా పోలీసుల పనితీరు, క్షేత్ర స్థాయిలో విధి నిర్వహణలో వారు ఎదుర్కొంటున్న సవాళ్లు, పాత నేరస్తులు, రౌడీ షీటర్లపై నమోదైన కేసులు విచారణ స్థితి తదితర విషయాలను గురించి ప్రత్తిపాడు సర్కిల్ సీఐ ఎ.శ్రీనివాసరావుతో సమీక్ష నిర్వహించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి, ప్రజలు స్వేచ్ఛగా పోలీస్ వారికి తమ సమస్యలు చెప్పుకునే విధంగా తగిన వాతావరణం కల్పించాలని సూచించారు. వారి పిర్యాదుల పట్ల సత్వరమే స్పందించి, వాటిని చట్ట పరిధిలో పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీస్ స్టేషన్లోని పలు రికార్డులను పరిశీలించి గతంలో నమోదైన వివిధ కేసుల దర్యాప్తు పురోగతిని, పాత నేరస్తులు, రౌడీ షీటర్ల గురించిన సమాచారాన్ని, వారి కదలికలను, వారి ప్రస్తుత పరిస్థితులను పరిశీలించి వారు మరలా ఏవైనా అసాంఘిక కార్యకలాపాలకు గానీ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు గాని పాల్పడకుండా తగిన కౌన్సెలింగ్ నిర్వహించి, వారిపై నిఘా పెంచాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. మహిళలు, చిన్నపిల్లల భద్రత సంరక్షణలో వారి పాత్ర ఎంతో ప్రాముఖ్యమైనది తెలిపారు. పెదనందిపాడులోని రామాలయం (పర్చూరు రోడ్డు)సెంటర్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు, వాటి పనితీరును పరిశీలించి నేరస్తుల కదలికలను సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో గుర్తించే విధంగా తగిన ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. ప్రజలకు కూడా సీసీ కెమెరాల ఏర్పాటు యొక్క ప్రాముఖ్యతను తెలియపరిచి వారు కూడా సీసీ కెమెరాలు అమర్చుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట పెదనందిపాడు ఎస్ఐ మధుపవన్ ఉన్నారు.

ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తిని బతికించారు

జీజీహెచ్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యుల ఘనత

గుంటూరు మెడికల్: పొట్టకు టీబీ(క్షయ వ్యాధి) సోకి పొట్టంతా రంధ్రాలు పడిపోయి మల విసర్జన ప్రక్రియ అంతా పొట్ట నుంచి బయటకు వచ్చి తీవ్ర ఇన్‌ఫెక్షన్, తీవ్ర అనారోగ్యానికి గురైన వ్యక్తికి గుంటూరు జీజీహెచ్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అందె కోటివెంకటేశ్వరరావు అరుదైన శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. వివరాలు.. పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన 35 సంవత్సరాల షేక్ మొహమ్మద్ జానీ, టిఫిన్ బండి వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మూడేళ్లుగా పొట్టకు టీబీ సోకి పొట్టలోని పేగులు రంధ్రాలు పడిపోయి సదరు రంధ్రాల ద్వారా మలం బయటకు వస్తుంది. భోజనం చేస్తే వెంటనే మోషన్ అవడం, పొట్ట ఉబ్బరం, తరచూగా జ్వరం, తీవ్రమైన ఇన్‌ఫెక్షన్ వంటి సమస్యలు వస్తున్నాయి. తినకపోతే పూర్తిగా నీరసించిపోతున్నాడు. పిడుగురాళ్లలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో రెండు సార్లు శస్త్రచికిత్స చేసినా సమస్య నయం కాలేదు. వారి ద్వారా గుంటూరు ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. అక్కడ కూడా రెండు సార్లు ఆపరేషన్ ఫెయిల్ అయి తిరుపతి బర్డ్స్ హాస్పిటల్‌కు వెళ్లాడు. చాలా క్లిష్టమైన సర్జరీ అని, రోగి ప్రాణాలకు గ్యారంటీ లేదని చెప్పడంతో ఈఏడాది జనవరిలో సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి వచ్చినట్లు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అందె కోటి వెంకటేశ్వరరావు తెలిపారు. పొట్టపై అనేక రంధ్రాలు ఉండటంతో పలు మార్లు శస్త్రచికిత్సలు చేసి వాటిని సరిచేయడం ద్వారా మలం బయటకు రాకుండా నిలుపుదల చేశామన్నారు. మల విసర్జన మార్గం ద్వారా మలం బయటకు వచ్చేందుకు మరో సర్జరీ చేసేందుకు కొంత సమయం పడుతోందన్నారు. ప్రాణాపాయ స్థితిలో చికిత్స కోసం వచ్చిన తమ బిడ్డను బతికించారని జానీ కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. మూడేళ్ల సమస్యకు పరిష్కారం చూపి ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగిని కాపాడిన సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ అభినందనలు తెలిపారు.



మానిన గాయాలు చూపిస్తున్న జానీ

10 నుంచి జన సేవాదళ్ శిక్షణ

మంగళగిరి: నగర పరిధిలోని చినకాకానిలో సీపీఐ అనుబంధ సంఘం జనసేవాదళ్ రాష్ట్ర స్థాయి శిక్షణ శిబిరాన్ని ఈ నెల 10న సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ ప్రారంభిస్తారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం చినకాకాని పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో అజయ్‌కుమార్ మాట్లాడుతూ జనసేవాదళ్ సభ్యులు అకాల వరదలు, అగ్నిప్రమాదాలతో పాటు జాతీయ విపత్తులు సంభవించినప్పుడు సేవలు అందిస్తుందన్నారు. ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకు శిక్షణ శిబిరం జరుగుతుందన్నారు. జాతీయ విపత్తులు, రోడ్డు ప్రమాదాలు, ఇతర విపత్తుల సమయంలో జనసేవాదళ్ సేవలు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చిన్ని తిరుపతయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



ఫిరంగిపురం: ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో దోహదం చేస్తాయని సర్పంచ్ మేడాబాబు అన్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. వివిధ పనుల నిమిత్తం పలు గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో వడ్లమూడి రమేష్, పి.హృదయ రాజు, అప్పారావు, పంచాయతీ కార్యదర్శి ఏకే బాబు పాల్గొన్నారు.

బలవంతంగా నగదు వసూలు తగదు

పట్నంబజారు: నగరంలోని ప్రధాన కూడళ్లు, ట్రాఫిక్ జంక్షన్లు, వ్యాపార సముదాయాల వద్ద సంచరిస్తూ వాహనదారులు, దుకాణ దారుల వద్ద నుంచి బలవంతంగా నగదు వసూలు సరికాదని మహిళ పోలీసు స్టేషన్ డీఎస్పీ సుబ్బారావు సూచించారు. ఈమేరకు నగరంపాలెంలోని మహిళ పోలీసు స్టేషన్‌లో పలు ప్రాంతాలకు చెందిన ట్రాన్స్‌జండర్స్‌తో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో డబ్బులు ఇవ్వని వారిని పరుష పదజాలంతో దూషిస్తున్నారని ఫిర్యాదులు అందినట్లు చెప్పారు. రాత్రి సమయాల్లో ప్రజల స్వేచ్ఛకు భంగం కలిగించడం, బహిరంగ ప్రదేశాలు, రహదారులపై అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, అలాంటి వారిని ఉపేక్షించే ప్రసక్తి లేదని హెచ్చరించారు. ఎవరైనా ట్రాన్స్‌జండర్స్ ఇతర ప్రాంతాల నుంచి వచ్చి గుంటూరులో అలజడులు సృష్టించి, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మీకు సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

వివరాలు వెల్లడించిన డీఎస్పీ అబ్దుల్‌అజీజ్



మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్‌అజీజ్, ఎస్‌హెచ్‌ఓ వీరసోమయ్య, చిత్రంలో వెనుక ముసుగులో ఉన్న వ్యక్తులు నిందితులు

పట్నంబజారు: వృద్ధురాలిని హత్య చేసి, వారి కుటుంబ సభ్యులపై దాడికి తెగబడిన కేసులో ఇద్దరు ప్రధాన నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. పాతగుంటూరు పోలీసుస్టేషన్‌లో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈస్ట్ సబ్‌డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, పాతగుంటూరు పీఎస్ ఎస్‌హెచ్‌ఓ వై.వీరసోమయ్య వివరాలను మీడియాకు వెల్లడించారు. ఆనందపేట 2వలైను సమాధుల రోడ్డుకు చెందిన షేక్ అర్షద్, అదే ప్రాంతానికి చెందిన బాలికను ప్రేమిస్తున్నానని వెంటపడుతూ.. ఆ అమ్మాయి నా లవర్ అని, ఆమె సోదరులు నా బావమరుదులు అని ప్రచారం చేస్తున్నాడు. ఈ క్రమంలో విషయం తెలుసుకున్న బాలిక సోదరులైన షేక్ ఫైరోజ్, షేక్ ఫయాజ్, వారి స్నేహితులు సన్నీ, ఆసీఫ్ ఈ నెల 3వ తేదీ పొన్నూరు బారాఇమాం పంజా మసీదు వద్ద టీ స్టాల్ వద్ద అర్షద్‌ను తీవ్రంగా కొట్టి, బ్లేడులతో గాయపరిచారు. అర్షద్, ఇంటికి వెళ్లి విషయాన్ని తన తల్లిదండ్రులు హసన్ అలియాస్ బాబు, తల్లి షాజహాన్‌కు చెప్పాడు. ఈ క్రమంలో వారు కొంత మందిని తీసుకుని వెళ్లి ఫైరోజ్, ఫయాజ్ ఇంటికి వెళ్లి తల్లిదండ్రులైన జాఫర్, వహీదాలను కొట్టారు. దీనితో ఫైరోజ్ తండ్రి జాఫర్ కుమారులకు సమాచారాన్ని అందించిన క్రమంలో తిరిగి నలుగురు ఫైరోజ్, ఫయాజ్, సన్నీ, ఆసిఫ్‌లు ఉదయం 5.15 గంటలకు ఆనందపేటకు వెళ్లి అర్షద్ తల్లి షాజహాన్‌ను క్రికెట్ స్టంప్స్‌తో దాడి చేశారు. అనంతరం 6.30 గంటలకు అర్షద్ అమ్మమ్మ పఠాన్ ఖాజాబీ(70)పై పచ్చడి బండ, ఇనుపరాడ్లుతో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందింది. తరువాత ఫైరోజ్, ఫయాజ్ వారి స్నేహితులు ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఉన్న అర్షద్ తండ్రి హసన్‌ను కర్రలతో కొట్టి గాయపరచటంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. నలుగురు నిందితులు పరారయ్యారు. మృతురాలి మనవరాలు షేక్ జాస్మిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితులు ఫైరోజ్, ఫయాజ్‌లను మంగళవారం బుడంపాడు బైపాస్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులైన సన్నీ, ఆసిఫ్‌ల పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అరెస్ట్ చేసిన నిందితులను కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు తెలిపారు.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి



పెదకాకానిలో సీపీఐ ఆధ్వర్యంలో నిరసన

పెదకాకాని: పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని పొన్నూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ అన్నారు. పెదకాకానిలో మంగళవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం గ్యాస్‌పై పెంచిన 50 రూపాయలు వెంటనే తగ్గించాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన కేంద్ర ప్రభుత్వం గత 11 సంవత్సరాలలో అనేకసార్లు గ్యాస్,పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం జరిగిందన్నారు. అలాగే క్రూడ్ ఆయిల్ ధరలు ప్రపంచ వ్యాప్తంగా తగ్గుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం మాత్రం ధరలు తగ్గించకుండా అదే రేట్లు కొనసాగించటం వలన నిత్యావసరాల ధరలతో పాటు అన్ని వస్తువులు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. పెరిగిన ధరలతో సామాన్యుల పరిస్థితి అగమ్య గోచరంగా ఉందన్నారు. పెంచిన గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని, లేని పక్షంలో పోరాటం ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రెంటాల కుమారి, కేతినేని అగస్టీన్, దర్శి లింగారావు, ఆర్.మోజేష్ బాబు, హుస్సేన్, సిహెచ్.విజయలక్ష్మి పాల్గొన్నారు.

అండర్ -19 ఫుట్‌బాల్ జట్టుకు క్రీడాకారుల ఎంపిక



మోషే రాజు



పవిత్ర పావని



ఎంపికైన ఫిరంగిపురం క్రీడాకారులు

మేడికొండూరు: మండలంలోని కొరప్రాడు గ్రామానికి చెందిన ఫుట్ బాల్ క్రీడాకారులు మొఖరాల పవిత్ర పావని, మోషే రాజుఅండర్ - 19 ఆంధ్ర ప్రదేశ్ ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికై నట్లు మేడికొండూరు ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మొఖరాల శ్రీనివాసరావు, కార్యదర్శి మానుకొండ బ్రహ్మాజీ మంగళవారం తెలిపారు. 2024 నవంబరు 8 నుంచి 10వ తేదీ వరకు సత్తెనపల్లిలో జరిగిన అండర్-19 స్కూల్ గేమ్స్ స్టేట్ లెవెల్ ఫుట్ బాల్ టోర్నమెంట్లో పాల్గొన్నారని వెల్లడించారు. ఈ నెల 15 నుంచి 21వ తేదీ వరకు మణిపూర్‌లోని ఇంపాల్‌లో జరిగే జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ఫిరంగిపురం నుంచి..

ఫిరంగిపురం: అండర్-19 రాష్ట్ర ఫుట్ బాల్ జట్టుకు ఫిరంగిపురం ఫుట్‌బాల్ అసోసియేషన్ క్రీడాకారులు వి.విల్‌స్మిత్, ఏ.స్టాలెన్ ఎంపికై నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు సాంబశివరావు, కార్యదర్శి వి.శ్రీనివాసరావు సంయుక్తంగా మంగళవారం తెలిపారు.

ఘనంగా సీతారాముల వసంతోత్సవం



సీతారాముల వసంతోత్సవ గ్రామోత్సవం

మంగళగిరి టౌన్: శ్రీరామ నవమిని పురస్కరించుకుని స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పాత మంగళగిరి సీతారామ కోవెలలో మంగళవారం సీతారాముల వసంతోత్సవం ఘనంగా జరిగింది. గ్రామోత్సవం సీతారాముల కోవెల నుంచి ప్రారంభమై మిద్దె సెంటర్ వరకు చేరుకుని.. తిరిగి కోవెలకు చేరుకుంది. ఆయా సెంటర్లలో భక్తులు సీతారాముల వారిని దర్శించుకుని, టెంకాయలు కొట్టి కర్పూర నీరాజనాలు సమర్పించారు. దేవస్థానం అర్చకులు నంబూరి వంశీకృష్ణమాచార్యులు బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవానికి పట్టణానికి చెందిన కొల్లి లక్ష్మి గిరిధరరావు, సుజాత దంపతులు కై ంకర్యపరులుగా వ్యవహరించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి జేవీ నారాయణ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్తలు కృష్ణకుమారి, సీతానాగ మల్లేశ్వరి, కల్యాణి పాల్గొన్నారు.

మండలంలో విద్యుత్ తనిఖీలు



మాట్లాడుతున్న విజిలెన్స్ పర్యవేక్షక ఇంజినీర్ విజయకృష్ణ

ఫిరంగిపురం: మండలంలోని ఫిరంగిపురం, గరుడాచలపాలెం, గుండాలపాడు, బేతపూడి, గొల్లపాలెం, కండ్రిక, మేరికపూడి, రేపూడి, పొనుగుపాడు, వేమవరం, వేములూరిపాడు గ్రామాల్లో విద్యుత్ శాఖ విజిలెన్స్ తనిఖీలు మంగళవారం నిర్వహించినట్లు విజిలెన్స్ విభాగం పర్యవేక్షక ఇంజినీర్ బి.విజయకృష్ణ తెలిపారు. తనిఖీల్లో 35 మంది అధికారులు, 130 మంది సిబ్బంది 35 బృందాలుగా ఏర్పడి 2,066 సర్వీసులు తనిఖీ చేసినట్లు చెప్పారు. మీటరు లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 11 మంది నుంచి అపరాధ రుసుం రూ.28 వేలు, అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 9మంది నుంచి రూ.1.40లక్షలు, అనుమతించిన లోడుకన్నా అదనంగా విద్యుత్ వాడుతున్న 32మందికి రూ.3.42లక్షలు అపరాద రుసుం విధించామమని వెల్లడించారు. ఈ సమావేశంలో సీఆర్‌డీఏ పర్యవేక్షక ఇంజినీర్ పి.సుబ్రహ్మణ్యం, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్. వెంకటేశ్వరరావు, డీఈఈ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.ఏడుకొండలు, డీఈఈలు ఎస్ఎం ప్రసాద్, కె.రవికుమార్, గుర్నాథరావు, ఏఈలు చంద్రశేఖర్, కె.కోటేశ్వరరావు, ఎం.సతీష్‌కుమార్, ఎ.శివశంకర్, ఆపరేషన్ ఏఈ పి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరణకు చర్యలు

కొరిటెపాడు: విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఆ శాఖ సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పాశం రామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గృహ వినియోగదారులు ప్రస్తుతం కిలోవాట్‌కు రూ.2,200 చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చే వారికి 1 కిలోవాట్‌కు డెవలప్‌మెంట్ చార్జీలు రూ.1000, సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.200 చెల్లిస్తే సరిపోతుందని వెల్లడించారు. రెండు కిలో వాట్స్ అదనపు లోడుకు రూ.4,400 బదులుగా రూ.2,400 చెల్లిస్తే సరిపోతుందని, అలాగే నాలుగు కిలోవాట్స్ అదనపు లోడుకు క్రమబద్ధీకరించుకునేందుకు రూ.4,800 చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు. గుంటూరు సర్కిల్ పరిధిలో తెనాలి, గుంటూరు డివిజన్లలోని 6.12 లక్షల గృహ వినియోగదారులందరూ ఈ అవకాశాన్ని 2025 మార్చి 1వ తేదీ నుంచి 2025 జూన్ 30వ తేదీ వరకు వినియోగించుకోవచ్చన్నారు. గుంటూరు సర్కిల్ పరిధిలో ఉన్న 6.12 లక్షల గృహ వినియోగదారులు ఇఆర్వో/సబ్ ఇఆర్వో రెవెన్యూ కౌంటర్లు, మీ సేవా కేంద్రాలు, ఏపీసీపీడీసీఎల్ వెబ్‌సైట్ www.apcpdc.comలో దరఖాస్తు చేసుకొని తగిన చార్జీలు చెల్లించి అదనపు లోడును క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని 2025 జూన్ 30వ తేదీ లోగా వినియోగించుకోవాలని కోరారు.

సావిత్రీబాయి పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

నెహ్రూనగర్: జ్యోతిరావుపూలే విగ్రహం పక్కనే సావిత్రీబాయి పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని బీసీ సంఘాల నాయకులు విన్నవించారు. ఈ మేరకు మంగళవారం నగర ఇన్‌చార్జి మేయర్ షేక్ సజీల, నగర కమిషనర్ పులి శ్రీనివాసులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ కాలేజీ సెంటర్‌లో మహాత్మ జ్యోతిరావుపూలే విగ్రహం పక్కనే సావిత్రీయి పూలే విగ్రహం చేయడంతో పాటు ఐలాండ్ నిర్మించాలని కోరారు. ఏప్రిల్ 11న జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా పూలే విగ్రహానికి రంగులు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహాత్మజ్యోతిరావుపూలే సేవా సంఘం అధ్యక్షులు లింగాల వెంకటసాయి, బీసీ సంఘాల నాయకులు తాటికొండ నరసింహారావు, జూపూడి శ్రీనివాసరావు, సాధు మాల్యాద్రి, బత్తుల వీరాస్వామి పాల్గొన్నారు.